# రాధ

దేవలపల్లి వీరయ్య

"రాధా, ఈవిడ ఏమంటూందో తెలుసా, నువ్వు కట్టుకున్న చీర చాలా బాగుందట! అందుకని నిన్ను చూస్తుంటే ముచ్చటగా ఉందట!" అంది శకుంతల తమ బంధువు సుజాతని చూపిస్తూ.

సుజాతకి తమిళం తప్ప మరో భాష రాదు!

రాధకి మాతృభాషతో బాటు కాస్త ఇంగ్లీషూ, కొద్ది కొద్దిగా హిందీ వచ్చు.

భర్తను డ్యూటీకి సాగనంపిన తరవాత ఏమీ తోచదు రాధకి! ఇంటికి వచ్చే పత్రికలు తిరగేసి, తిరగేసి విసుగొస్తుంది. డిజైన్లు వేసివేసి బోర్ కొడుతుంది. చాలా మధ్యాహ్నాలను పక్క ఇంట్లో— అంటే శకుంతలతో పిచ్చాపాటి మాట్లాడుతూ గడుపుతుంది. శకుంతలకు డిజైన్లంటే పెద్దగా ఆసక్తి ఉండదు. అందుకనే అప్పుడప్పుడు శకుంతల దగ్గరకూడా బోర్ గా ఉంటుంది రాధకి!

"ఈ సుజాత ఇంక ఎన్నాళ్ళుంటుంది ఇక్కడ శకుంతలక్కా? నిన్న ఈమెను చూసిన మొదటి క్షణం లోనే అనుకున్నా- చాలా మంచి మనిషని! కాని, వచ్చిన చిక్కల్లా భాషలోనే.... ఏం చేయను. నాకు తమిళం రాదు. ఈమెకు తెలుగు రాదు! ఈమెకు నా చీర ఎలా బాగుందో వివరా లడిగి కాస్త చెప్పవూ?" బ్రతిమాలింది రాధ.

శకుంతల "సరే" నన్నట్లుపైకి కనిపించ నంతగా నవ్వి సుజాతతో తమిళంలో మాట్లాడి "బార్డర్ బాగా కనిపిస్తుందట!" అంది



"సుజాతని ఓ నెల రోజులు ఇక్కడే వుండిపొమ్మను అక్కా. ఈలోగా తెలుగు నేర్పుతాను." అంది రాధ.

"మరి నువ్వో...." అనాలోచితంగా అంది శకుంతల.

"బై ది బై నేను తమిళం నేర్చుకుంటాను!"

"బాగానేవుంది కాని ఈవిడ యెల్లుండే వెళ్ళిపోతుందిగా మద్రాసుకి! నెలరోజులు వుండిపొమ్మని ఈవిడని ఒప్పిస్తానేమో. కాని ఈవిడ భర్తని ఎలా ఒప్పించ గలను?"

"నిజమే శకుంతలక్కా!" విచారం వ్యక్తం చేసింది రాధ

"కళ్ళు మూతలు పడుతున్నాయి. కాస్త మేను వాలుస్తాను. మీరిద్దరూ ఒకరి ముఖా లొకరు చూసుకుంటూ ఇద్దరు బొమ్మల్లా కూర్చోక ఈ పత్రికల్ని తిరగేస్తూ వుండండేం!" ఆవలిస్తూ లేచి తమిళంలో సుజాతకూడా చెప్పి బెడ్ రూం లోకి వెళ్ళిపోయింది శకుంతల.

రాధ, సుజాతా శకుంతల చెప్పి వెళ్ళి నట్లే ఓ అరగంట పత్రికలు తిరగేశారు.

పత్రికల్లోని కొన్ని డిజైన్లు చూపించింది రాధ, సుజాతకి.

తరవాత పత్రికలు పక్కకు పెట్టి "మీ రంటే నాకు చాలా ఇష్టం!" అంది రాధ.

సుజాత ఏమిటోగా తలూపింది!

'ఆప్ కో మై బహుత్ పసంద్ కర్ తూఁ' అంది రాధ

సుజాత మునుపటిలాగే తలూపింది।

"ఐ లైక్ యూ వెరీమచ్ " అంది రాధ.

ఈ సారి తమిళంలో ఏమో అంది సుజాత।

'ఈమెతో తెలుగులో మాట్లాడితేనే బాగుంటుందేమో' అనుకొని రాధ "ఈ పక్కిల్లు మాదేనండి. నాకు చాలా చీరె లున్నాయి. తీసుకొచ్చి చూపించనా? అయితే వుండండి, ఒక్క నిమిషంలో వస్తాను।" అంటూ రాధ లేచి బయటకు నడిచింది.

ఐదు నిమిషాల్లో ఓ సూట్ కేస్‌తో వచ్చి "చూడండి ఇవన్నీ నావే...." అంటూ సూట్ కేస్ విప్పి అందులో క్రమంగా పేర్చబడివున్న చీరల్ని ఒక్కొక్కటే తీసి చూపించసాగింది.

సుజాత పరిశీలనగా ఒక్కొక్క చీరెనే విప్పి చూస్తూ ఆశ్చర్యం, ఆనందం, ఆలోచన ముఖంలో వ్యక్తపరుస్తూ తమిళంలో తన అభిప్రాయాలు చెప్పింది.

ఈలోగా సుజాత ఓసారి పక్క గదిలోకి వెళ్ళొచ్చింది. గులాబి రంగు అమెరికన్ జార్జెట్ చీరని తీసి బాగా పరీక్షించసాగింది సుజాత. తరవాత తమిళంలో ఏదో అంది.

"వంద రూపాయలకు తక్కువ ఏదీ లేదు ఇందులో।" చిన్నపిల్లకు ఏదో బుజ్జగించి చెప్పినట్లు చెప్పింది రాధ.

మరోసారి లోపలకి వెళ్ళొచ్చింది సుజాత.

రాధ చీరల్ని మడత పెట్టడంలో మునిగిపోయింది।

సుజాత వంద రూపాయల నోటు తెచ్చి రాధకి ఇవ్వబోయింది।

రాధ నివ్వెరపోయింది।

కొద్దిసేపటికి తేరుకొని "మేమేం వ్యాపారం చేస్తున్నామనుకున్నారా ఏమండీ? అబ్బే అదేం కాదు. ఇవన్నీ నా చీరలే అని చూపిస్తున్నాను ఎలా ఉన్నాయో మీ అభిప్రాయం చెప్పరేమిటి?" అంది.

తమిళంలో ఏదో చెప్పింది సుజాత।

రాధ చీరలన్నిటినీ మునుపటిలా సూట్ కేసులోకి సర్ది "మా ఇంట్లో పెట్టొస్తానండి " అంటూ కదలింది.

ఇంటికొచ్చి ఓసారి చీరెల్ని లెక్క పెట్టుకుని ఆశ్చర్యపోయింది రాధ। ఒక చీర తక్కువయింది। పోయిన చీరనిగుర్తు చేసుకునేసరికి తల పగిలింది। అది లేత గులాబి అమెరికన్ జార్జెట్।

'ఇప్పుడేం చేసేది? సుజాతని వెళ్ళి అడగాలా? లేక తనే ఎక్కడైనా మరిచిందా? ఇంకెక్కడ? ఎక్కడా లేదు। బహుశః సుజాతే తీసి వుంటుంది. వెళ్ళి అడిగితే దొంగతనం మోపావంటుందేమో తమిళంలో। ఈ విషయం శకుంతలక్కకి తెలిస్తే ఇంకేమైనా ఉంటుందా. మరోసారి ఇంట్లోకి కూడా రానివ్వదు। ఎలా? ఏం చేసేది?'

ఆ సాయంకాలం భర్త వచ్చేసరికి రాధ పడగ్గదిలో మూలుగుతూ పడుకొంది।

రామ్మూర్తికి ఎంతసేపటికీ విషయం చెప్పదు రాధ। చివరికి రాత్రి ఏ ఎనిమిదింటికో సస్పెన్సు తేల్చింది.

"నువ్వు చేతులారా చేసుకున్న దానికి నేనేం చేయను? వెళ్ళి సుబ్బారావ్‌గారి ద్వారా శకుంతలద్వారా సుజాతని అడగనా?"

"అలాకాదు, శకుంతలక్కకి తెలియకుండా సాధించండి।" క్షీణ స్వరంతో అంది రాధ.

రామ్మూర్తి చటుక్కున బయటికెళ్ళి రాత్రి పదింటికి వచ్చాడు చేతిలో గులాబి రంగు అమెరికన్ జార్జెట్ చీరతో।

అది చూసి రాధ కళ్ళు ఒక్కసారిగా మెరిశాయి. "ఎలా అడిగారండీ?" అనడిగింది నవ్వుతూ.

"ఎవరిని." ప్రశ్నించాడు రామ్మూర్తి.

"సుజాతని." అంది.

"సుజాత దగ్గరనుంచి కాదు. బజారు నుంచి తెచ్చాను. ఇదే కదా నువ్వన్నది?"

"ఇదికాదు- సుజాత దగ్గరిదే కావాలి।" మళ్ళీ మంచం పట్టింది రాధ.

తలకు చేతులాన్చి రాత్రంతా గడిపాడు రామ్మూర్తి.

మరునాడు ఆఫీసుకి సెలవు పెట్టి రామ్మూర్తి సాయంకాలం ఆరుగంటలకి చేతిలో కాస్త నలిగిన గులాబిరంగు అమెరికన్ జార్జెట్‌తో రాధ ముందు ప్రత్యక్షమై "ఇదిగో సాధించాను। ఇది సుజాత దగ్గరిదే తన భర్తకి చూపించాలని నీ దగ్గరినుంచి తీసుకుందట। నిన్న బజారునుంచి తెచ్చింది వాపస్ చేశాను।" అన్నాడు.

రాధ మంచం మీది నుంచి లేచి మంచి నీళ్ళు తాగొచ్చి చీరని సూట్ కేసులో దాచి భర్త ముఖంలో ముఖం పెట్టి "మీరు చాలా మంచివారండీ। ఆ సుజాతని ఎలా అడగలిగారో ఏమో. శకుంతలక్కకు తెలియకుండా। ఇంత వంట చేస్తానుండండి।" అంటూ వంటింట్లోకి నడిచింది.

మూడవనాటి ఉదయం సుజాత భర్తతో వచ్చి మద్రాస్ వెళుతున్నామని తమిళంలో వీడ్కోలు చెబుతూ వెళ్ళింది.

రాధ మళ్ళీ మంచం పట్టింది। ఎందుకంటే సుజాత వీడ్కోలు చెప్పడానికి వచ్చినప్పుడు గులాబిరంగు అమెరికన్ జార్జెట్ చీర కట్టుకునుంది।

రామ్మూర్తికి ఏం చేయాలో పాలుపోలేదు. మళ్ళీ ఆఫీసుకి సెలవైతే పెట్టొచ్చాడు.

అయితే ఆ సాయంకాలం శకుంతల ఆ ఇంట్లోకి ప్రత్యక్షమై "రాధా. ఇదిగో వంద। చీర అమ్మినావటగా సుజాతకి? చాలా చాలా థాంక్స్ చెప్పమంది।" అంది.

రాధ దగ్గుత్తికతో "ఆమే తీసుకొంది. నేనమ్మలేదు" అంది కళ్ళు తుడుచుకొంటూ.

